క్లుప్తంగా

ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి



తెర్లాం సచివాలయంలో చేస్తున్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు

తెర్లాం: జగనన్న కాలనీ లేఅవుట్‌లోని ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని ఎంపీడీవో మధుసూదనరావు, తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి సూచించారు. మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో చేపడుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను వారు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు ఉచితంగా ఇళ్లస్థలాలు పంపిణీ చేయడంతో పాటు వాటిపై లబ్ధిదారుకు పూర్తి హక్కు కలిగేలా రిజిస్ట్రేషన్లు కూడా రూపాయి ఖర్చు లేకుండా చేపడుతోందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు సంయుక్తంగా రిజిస్ట్రేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

సేవాభావం అలవర్చుకోవాలి

రేగిడి: విద్యార్థులు చదువుతో పాటు సేవాభావం కూడా అలవర్చుకోవాలని జీఎంఆర్ ఐటీ ఎన్.ఎస్.ఎస్(జాతీయ సేవా పథకం) ప్రోగ్రాం ఆఫీసర్ కె.వి.ఎస్.ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని తాటిపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక సేవ ఆవశ్యకతను వివరించారు. ఎన్.ఎస్.ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ అవగాహన కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గార రాంబాబు, సర్పంచ్ పేడ బాబూరావునాయుడు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనలను ఓడించండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు

బొబ్బిలి: ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తూ దేశానికి తీరని నష్టం కలిగిస్తున్న బీజేపీకి మద్దతు తెలుపుతున్న టీడీపీ, జనసేన పార్టీలను రానున్న ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇదే విషయమై స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీకి ప్రాధాన్యత లేకపోయినప్పటికీ ఆ పార్టీ పొత్తు కోసం టీడీపీ, జనసేనలు వెంపర్లాడుతుండడం సిగ్గుచేటన్నారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల నమ్మకాన్ని తాకట్టు పెట్టే అటువంటి పార్టీలను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, రైతు సంఘం నాయకులు ఎస్.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తులు పరిశీలించండి

బొబ్బిలి: ఆన్‌లైన్‌లో వచ్చిన ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలించాలని తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశమైన ఆయన దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సరిగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయికి వెళ్లి, నిర్ధారించుకోవాలని, తద్వారా ఓటరు జాబితా పక్కాగా తయారవుతుందన్నారు.

12 మద్యంసీసాలు స్వాధీనం

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఈపీడీసీఎల్ కార్యాలయానికి వెళ్లే దారిలో స్కూటీపై అక్రమంగా తరలిస్తున్న 12 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం రాత్రి అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ జి.లోవరాజు, సిబ్బంది వెళ్లి, ఆకస్మిక తనిఖీలు చేయగా ఓ వ్యక్తి మద్యం సీసాలు తరలిస్తూ పట్టుబడ్డాడని పేర్కొన్నారు.

ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

మెంటాడ: మండలంలోఇన ఇద్దనివలస గ్రామంలో ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు సోమవారం రాత్రి నిర్వహించారు. మొత్తం 121 మంది రక్త నమూనాలు సేకరించి, పరీక్షించామని హెల్త్ సూపర్‌వైజర్ రాజేంద్ర తెలిపారు. బోదకాలు వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం చొరవ తీసుకుంటోందని, ప్రజలంతా పరీక్షలు చేయిచుకోవడానికి ఆసక్తి కనబరచాలని కోరారు.

రూ.67 లక్షలతో తాగునీటి సరఫరాకు చర్యలు

తెర్లాం: మండలంలోని గోపాలవలస పంచాయతీలో జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.67 లక్షల వ్యయంతో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఇదే పంచాయతీలోని గోపాలవలస, జగన్నాథవలస గ్రామాల్లో తాగునీటి కుళాయిలు, పైపులైన్ ఏర్పాటుకు సంబంధించిన పనులను ఆయన సోమవారం పరిశీలించారు. మరికొద్దిరోజుల్లో పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మోహన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్‌కు ఘనస్వాగతం పలుకుతున్న సోమరాజుపేట గ్రామస్తులు

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని రెడ్డిపేట, ఆమదాలవలస, చినలింగాలవలస, పెదలింగాలవలస, తోకలవలస, సోమరాజుపేట, తాటిపాడు, లచ్చన్నవలస గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా తెలియజేయాలని అడగ్గా, అన్ని పథకాలు అందుతున్నాయని, జగనన్న పాలన చాలా బాగుందని గ్రామస్తులు సంతోషంగా తెలిపారు. ఆ తర్వాత ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, పలు సంఘాల నేతలు, పెద్దలతో ఆయన సమావేశమై, రానున్న ఎన్నికల్లోనూ తనకు, పార్టీకి సంపూర్ణ మద్దతు తెలిపి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన సంస్కరణలతో పాలన సులభతరమైందని, గ్రామాల్లోని సచివాలయాల ద్వారా పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయని, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. గ్రామాల్లోని సచివాయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించాలన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేలా జరిగిన అభివృద్ధి పనులను తెలియజేయాలన్నారు. జగనన్న పాలనలో ప్రతీ వర్గంలోని ప్రజలకు జరుగుతున్న మంచిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రస్తుతం ప్రతీ పంచాయతీలో కొత్తగా పలు ప్రభుత్వ భవనాలు, రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టులు, ఇంటింటికీ కుళాయిలు కనిపిస్తున్నాయని.. ఇది కాదా అభివృద్ధి అని ప్రతిపక్షాలు కళ్లు తెరిపించేలా అవగాహన కల్పించాలన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి సీఎం జగనన్నను గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, సర్పంచ్‌లు సవలాపురపు రమేష్‌నాయుడు, కెంబూరి వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, గార రమణ, పేడ బాబూరావునాయుడు, గొర్జాన అప్పలనాయుడు, మామిడి వేణునాయుడు, ఎంపీటీసీలు రెడ్డి నర్సింగరావు, పిల్లా గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సోమరాజుపేటలో కొత్తగా నిర్మించిన వినాయక మండపాన్ని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సవలాపురపు రమేష్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ సవలాపురపు నర్సిమప్పారావునాయుడు, వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ కె. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



తహసీల్దార్ కార్యాలయం వద్ద డీటీ సుబ్బారావు, పోలీసులతో వాదిస్తున్న కొట్టక్కి రైతులు

రామభద్రపురం: భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కొట్టక్కి గ్రామానికి చెందిన దళిత రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొట్టక్కి గ్రామ రెవెన్యూ పరిధిలోని కాకర్లవలస గ్రామం 537 సర్వే నంబరు భూముల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విధులకు హాజరవుతున్న రెవెన్యూ ఉద్యోగులను కార్యాలయం లోపలకు వెళ్లకుండా ఆందోళనకారులు అడ్డుకున్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో భూ పంపిణీలో భాగంగా కొట్టక్కి రైతులకు 65 ఎకరాల డి.పట్టాలు పంపిణీ చేశారన్నారు. దళిత రైతులు ఈ భూములు సాగు చేస్తుండగా సాలూరుకు చెందిన టొంపల నాగరాజు, టొంపల బాలమ్మ అనే ఇద్దరు విశ్రాంత ఉద్యోగులు ఆ భూములను ఆక్రమించుకుని, సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఆక్రమణదారుల నుంచి భూములు లాక్కొని, దళితులకు ఇవ్వాలని కోరారు. అధికారులు పట్టించుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు అలమండ ఆనందరావు, బి.రమణమ్మ, లెంక లక్ష్మి, పి.అప్పారావు, కె.భీముడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



అప్పలనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత రెడ్డి అప్పలనాయుడు ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన అప్పలనాయుడు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం అప్పలనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. మండలంలోని పొగిరి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సుమల దీప భర్త సుమల శ్రీనివాసరావు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆ కుటుంబాన్ని కూడా కలిసి పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట పాలవలస దవళేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ నాయకులు పొట్నూరు లక్ష్మణరావు, చిన్న, సతీష్ తదితరులు ఉన్నారు.

మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్

రాజాం సిటీ: పట్టణంలో మార్చి 9వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులన్నీ ఇరుపార్టీల అంగీకారంతోనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు వాపసు కూడా ఇస్తామన్నారు. కక్షిదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళా సంఘాల సర్వే చేపట్టాలి

వంగర: మహిళా సంఘాల సర్వే చేపట్టాలని ఏపీఎం చక్రపాణి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలు, వీవోఏలతో సోమవారం సమావేశమైన ఆయన ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో మహిళల్లో జీవనోపాధులు పెంపొందించాలని తెలిపారు. ఎన్‌ఆర్‌ఎల్‌ఎం వీపీఆర్‌పీ యాప్‌లో మహిళా సంఘాల సర్వే వివరాలు పొందుపరచాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాల రికవరీకి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏపీఎం తెర్లి మంగమ్మ పాల్గొన్నారు.

మౌలిక వసతులు తప్పనిసరి

రేగిడి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని ఎంఈవో బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని నాయిరాలవలస గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన పాఠశాల పరిసరాలు, ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. ప్రతీ పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, మైదానం వంటి సదుపాయాలు ఉండాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సదుపాయాలు కూడా కల్పించాలన్నారు.

కులగణనను వేగవంతం చేయండి

రాజాం సిటీ: గ్రామాల్లో చేస్తున్న కులగణన సర్వేను వేగవంతం చేయాలని ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశమైన ఆయన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, పారిశుద్ధ్య పనులు, ఇంటి పన్ను వసూళ్ల లక్ష్యాలు చేరుకోవాలని తెలిపారు.

విద్యుత్ సమస్య ఉండకూడదు..

వంగర: పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో ఎం.వి.బాలసుబ్రహ్మణ్యం సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ లైన్‌మేన్స్(జేఎల్ఎం)లతో సమావేశమైన ఆయన అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం ఉండేలా చూడాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల విక్రయాలు



కూరగాయల అమ్మకాలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రామారావు

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయ పంటలను విక్రయానికి సిద్ధం చేశారు. అక్కడికి వచ్చే ప్రజలు, అధికారులకు వాటి ప్రయోజనాలు తెలుపుతూ అమ్ముతున్నారు. జెడ్పీటీసీ రామారావు సోమవారం కార్యాలయానికి వెళ్లి, ఏయే కూరగాయలు అందుబాటులో ఉన్నాయన్న విషయం అడిగి తెలుసుకోగా, మండలంలోని గొల్లాది, గజరాయునివలస, వీరసాగరం గ్రామాల్లో ప్రకృతి సాగు పద్ధతుల ద్వారా పండించిన వంకాయలు, దొండకాయలు, టమాటా, ముల్లంగి, క్యారెట్ వంటివి ఉన్నాయని విక్రయదారులు తెలిపారు. అలాగే ప్రకృతి సాగు ద్వారా పండించిన పంటలను తినడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఎంపీపీ ప్రతినిధి తెంటు మధు, కోడూరు ఉప సర్పంచ్ రెడ్డి కృష్ణ, మండల పరిషత్ ఏవో రామలింగేశ్వరరావు, ఎస్‌వో రాజు తదితరులు ఈ కూరగాయలను కొనుగోలు చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని సీఐ తిరుమలరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్నందున సమస్యాత్మక గ్రామాలను గుర్తిస్తున్నామన్నారు. మండలంలోని రొంపల్లి, ఆరికతోట, బూసాయవలస, కొండకెంగువ, కొట్టక్కి, రామభద్రపురం గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి, ఆయా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే మరికొన్ని గ్రామాల్లో ఇరుపార్టీల వ్యక్తులపైనా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. మండలంలోని 450 పైబడి వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాదక ద్రవ్యాల రవాణా జరగకుండా పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేసి, వాహన తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. బైపాస్ జంక్షన్ నుంచి బొబ్బిలి వెళ్లే దారిలో చివరి వరకు రోడ్డు పక్కన దుకాణాదారులంతా రోడ్డు విస్తరణలో భాగంగా స్వతహాగా దుకాణాలు తొలగించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. అయితే వారికి రోడ్డు మార్జిన్ ఇవ్వడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు సహకరించడం లేదన్నారు. ఆ శాఖ అధికారులు ముందుకు వస్తే దుకాణాలు తొలగించడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జ్ఞానప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వారపుసంత పునఃప్రారంభానికి తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు

బొబ్బిలి: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని సమావేశ మందిరంలో ఏఎంసీ(అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ) పాలకవర్గ సాధారణ సమావేశం సోమవారం జరిగింది. ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వారపుసంత పునఃప్రారంభం, రైతుబజారుకు స్థల కేటాయింపు వంటి నిర్ణయాలు తీసుకుని, సభ్యులు తీర్మానం చేశారు. ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తున్న వారపుసంతను కోవిడ్ విపత్తు సమయంలో మూసివేశారు. ఇప్పుడు దానిని మళ్లీ ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంపై దండోరా, చాటింపు ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించనున్నారు.

రైతుబజారుకు స్థలం కేటాయింపు..

ఇక్కడ స్థల సమస్య కారణంగా రైతుబజారు లేకపోగా, మార్కెట్ యార్డు స్థలంలో బొబ్బిలి-బలిజిపేట ప్రధాన రోడ్డును ఆనుకుని ఉన్న స్థలాన్ని రైతుబజారు ఏర్పాటుకు కేటాయించినట్లు సభ్యులు తెలిపారు. బొబ్బిలి ఏఎంసీ పరిధిలోని తెర్లాం, బాడంగి మండలంలోని డొంకినవలస, బొబ్బిలిలో రూ.2.40 కోట్ల వ్యయంతో గొడౌన్లు నిర్మించనున్నామన్నారు. అలాగే ఇప్పటి గొడౌన్ల మరమ్మతులు, కొత్తగా ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామన్నారు. బొబ్బిలి ఏఎంసీ పరిధిలో పన్నులు, సెస్సుల వసూళ్ల ద్వారా ఏఎంసీకి రూ.1.20 కోట్లు సమకూరాయని కార్యదర్శి కొరుబిల్లి ఈశ్వరరావు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ తెంటు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్‌కు సిద్ధంగా ఉండండి

సంతకవిటి: మండలంలో త్వరలో జరిగే సోషల్ ఆడిట్‌కు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఎఫ్ఏలు, టీఏలతో సమావేశమైన ఆయన 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు రూ.13.40 కోట్ల మేర పనులు జరిగాయని, వీటికి సంబంధించి, ఆడిట్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పనుల వివరాలతో పాటు ఖర్చుల వివరాలపై ఆడిట్ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రఘునాథాచారి, ఏపీవో హరనాథరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలి

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



వలంటీర్లకు నియామకపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: వలంటీర్లు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కొత్తగా నియమితులైన ఏడుగురు వలంటీర్లకు ఎమ్మెల్సీ చేతులమీదుగా నియామకపత్రాలు సోమవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, గతంలో ఏ ప్రభుత్వమూ ఇటువంటి ప్రజా సంక్షేమ పాలనతో పాటు లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందించే ఆలోచన చేయలేదన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో వలంటీర్ల సేవలు ఎంతోమంది ప్రజల ప్రాణాలను కాపాడిందన్నారు. మిగిలిన రాష్ట్రాలు కూడా ఇక్కడి వలంటీర్ వ్యవస్థను ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. కొత్తగా నియమితులైన వలంటీర్లంతా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రూ.270



రాజాం: పొగిరి చెరువు వద్ద ఉపాధి పనులకు హాజరైన వేతనదారులు



రేగిడి: లచ్చారాయపురంలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు



వంగర: వేతనదారుల మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీవో సత్యవతి

రాజాం: నిర్దేశిత కొలతల ప్రకారం ఉపాధి హామీ పథకం పనులు చేయాలని ఏపీవో కె.సాయిరాం సూచించారు. మండలంలోని పొగిరి, గురవాం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ప్రతిరోజూ రెండు పూటలా నిర్దేశిత కొలతల్లో పనులు చేయాలని, అలా అయితే రూ.270 వేతనం వస్తుందన్నారు. పని ప్రదేశంలో ప్రథమ చికిత్సా కిట్, తాగునీరు, టెంట్లు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు పాల్గొన్నారు.

రేగిడి: జాబ్‌కార్డు ఉన్న వారిని మాత్రమే ఉపాధి పనులకు అనుమతించాలని ఏపీవో ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని లచ్చారాయపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం పరిశీలించిన ఆయన ఉదయం, సాయంత్రం రెండుపూటలా పనులు చేయాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేస్తే రూ.270 వేతనం వస్తుందన్నారు.

వంగర: ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులు రెండు పూటలా పని చేయాలని ఏపీవో మద్రాపు సత్యవతి సూచించారు. సోమవారం మండలంలోని ఓనెఅగ్రహారం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆమె నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందని తెలిపారు. వేసవి ఎండల నేపథ్యంలో పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు.

పక్కాగా ఓటరు జాబితా



బీఎల్‌వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ రాజారావు

బాడంగి: మండలంలోని 51 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు సంబంధించి, ఓటరు జాబితా పక్కాగా ఉండాలని తహసీల్దార్ ఎస్.రాజారావు ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశమైన ఆయన ఓటరు జాబితాలోని మృతుల ఓట్లు, శాశ్వతంగా వలస వెళ్లిపోయిన వారి ఓట్లు ఉంటే కలెక్టర్ అనుమతితో వాటిని తొలగించాలని తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లోని పరిస్థితులను పరిశీలించి, మౌలిక సదుపాయాలు ఉన్నదీ లేనిదీ తెలుసుకుని, లేని సదుపాయాలను కల్పించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ర్యాంప్ వంటి వసతులు ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో డీఈవో విజయ్‌కుమార్, ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ కలిసి మండలంలోని రావివలస-177, పినపెంకిలో 163, 164 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు

- స్పందన కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ



వంగర: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



తెర్లాం: ఆక్రమణలు తొలగించాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు



సంతకవిటి: మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

వంగర: ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ సూచించారు. మండలంలోని మద్దివలస గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమానికి హాజరైన ఆయన కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలపై ఆరాతీసి, ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. అనంతరం జలశక్తి సంఘాలతో సమావేశమై, రానున్న వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు వంటివి జలశక్తి సంఘాల ద్వారా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మీసాల చక్రపాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గొర్లె శ్రీచరణ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి..

తెర్లాం: స్థానిక కృష్ణంనాయుడు చెరువు గర్భాన్ని ఆక్రమించారని, ఆ ఆక్రమణలు తొలగించాలని ఎంపీడీవో మధుసూదనరావుకు పలువురు నాయకులు, రైతులు కోరారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధి నర్సుపల్లి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నర్సుపల్లి వెంకటనాయుడు, కృష్ణంనాయుడు చెరువు ఆయకట్టు రైతులు సంతపురి బుచ్చులదొర తదితరులు కలిసి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సింగపూర్ సిటీకి చెందిన రియల్ ఎస్టేట్ యజమాని చెరువు గర్భంలో స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తున్నారని, గతంలో పనిచేసిన తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. సింగపూర్ సిటీకి సంబంధించిన విస్తీర్ణాన్ని, చెరువు గర్భం విస్తీర్ణాన్ని సర్వే చేయించి, ఆక్రమణలు తొలగించాలన్నారు. రీసర్వేలో తన భూమి సర్వే సర్వే నంబర్లు కనిపించడం లేదని ఎన్.బూర్జవలసకు చెందిన బొత్స అప్పలస్వామి ఫిర్యాదు చేశారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో తెలిపారు.

సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి పలువురు వచ్చి, వివిధ సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు సమర్పించారు. వాటిని సంబంధిత అధికారులు స్వీకరించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.